# బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మన్యం అభివృద్ధి

- పోడు భూములకు పట్టాలు ఇచ్చింది మా ప్రభుత్వమే..
- మానవతా దృక్పథంతో గిరిజనులపై కేసులు తొలగించాం..
- గూడేలు, తండాలను పంచాయతీలుగా చేశాం
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కల్ల..
- ఆ పార్టీ నేతల వాగ్దానాలు పచ్చి అబద్ధాలు
- దమ్మపేట ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్


దమ్మపేట సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అశ్వారావుపేట అభ్యర్థి మెచ్చా

ఖమ్మం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని, బీఆర్ఎస్‌తోనే మన్యం అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. సీతారామ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రాజెక్టు పూర్తయితే జిల్లా ప్రజల సాగునీటి కష్టాలు పూర్తిగా తీరుతాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధజలం పంపిణీ చేస్తున్నామన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం నల్లా కనెక్షన్లు ఇచ్చామన్నారు. దీంతో గూడేల్లో అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరికిందన్నారు.

**గూడేలు, తండాలను పంచాయతీలుగా మార్చాం..**

ఆదివాసీలు, గిరిజనులను టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశాయే తప్ప, వారి బాగోగులను పట్టించుకోలేదని సీఎం ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే తండాలు, ఆదీవాసీ గూడేలు పంచాయతీలుగా మారాయని అన్నారు. ఇప్పుడు గిరిజనులే తమ ప్రాంతాలను పాలించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రస్తుతం రహదారులు దర్శనమిస్తున్నాయన్నారు. ఆంధ్రాకు సరిహద్దు అయిన అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల ప్రజలకు ఆంధ్రాలో రహదారులు ఎలా ఉన్నాయే తెలుసునన్నారు. అశ్వారావుపేట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు సౌమ్యుడు, సాత్వికుడు అని అన్నారు. ప్రజలు ఎన్నికల్లో మెచ్చాను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేటకు సెంట్రల్ లైటింగ్ మంజూరు చేసేదాకా మెచ్చా తనను వదల్లేదన్నారు.

**'పోడు' సమస్యకు పరిష్కారం..**

గిరిజనుల దశాబ్దాల కల అయిన పోడు భూములకు పట్టాల సమస్యను తామే పరిష్కరించామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చామన్నారు. రైతుబంధు, రైతుబీమా కూడా వర్తింపజేస్తున్నామని అన్నారు. పోడు భూములపై హక్కుల కోసం పోరాటం చేసిన గిరిజనులపై ఉన్న కేసులను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఎత్తివేసిందన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి అధికారం కల్ల..**

ఎన్నికలు వస్తే కాంగ్రెస్ నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తారని, ఎన్ని వాగ్దానాలు చేసినా, ఎన్ని అబద్ధాలు ఆడినా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల్ల అని సీఎం స్పష్టం చేశారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధును బంగాళాఖాతంలో కలుపుతామని అంటున్నారని, అలాగే మరో కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధును దుబారా అంటున్నారని విమర్శించారు. రైతుబంధు కావాలా..? వద్దా? అని సీఎం సభాముఖంగా ప్రజలను ప్రశ్నించగా.. ప్రజలు 'రైతుబంధు కావాలి..' అని పెద్దఎత్తున నినదిస్తూ సీఎంకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని సీఎం స్పష్టం చేశారు. పంటలకు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు నిరంతారాయంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. రైతులు చల్లగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, దేశం బాగుంటుందని, వారి సంక్షేమం కోసం తమ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. ధాన్యం కొనుగోలుపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని భరోసానిచ్చారు. సభలో బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీని వీడి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన మహిళా నేతలు వగ్గెల పూజ, సున్నం నాగమణి పాల్గొన్నారు.

## రూ.800 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి: ఎమ్మెల్యే మెచ్చా



అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.800 కోట్ల వరకు మంజూరు చేశారు. అడిగిన వెంటనే నిధులు ఇచ్చి అభివృద్ధికి బాటలు వేశారు. అందుకు ప్రజల తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. కళ్ల ముందే అభివృద్ధి కనిపిస్తున్నది. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలి. మాయ మాటలు చెప్పే ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు. ప్రజాసంక్షేమాన్ని కోరుకునే పార్టీకి పట్టంకట్టాలి. బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి. మున్ముందు కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తాను. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి ఎన్నికల్లో గెలవాలి. గెలుపును పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా అందించాలి.


బూర్గంపహాడ్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థులు రేగా, తెల్లం

## కాంగ్రెసోళ్లవి కారుకూతలు..

ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామంటూ కాంగ్రెసోళ్లు కారుకూతలు కూస్తున్నారని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించడం ద్వారా అసలు బంగాళాఖాతంలో కలిపేది కాంగ్రెసోళ్లనేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వబోమంటూ కొంతమంది అహంకారంగా మాట్లాడుతున్నారని అన్నారు. గేట్లు తాకనిచ్చేది వాళ్లు కాదని, ప్రజలేనని అన్నారు. ఓటు ద్వారానే కాంగ్రెసోళ్లకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ధరణి వల్లనే భూములపై రైతులకు సర్వ హక్కులూ వచ్చాయని అన్నారు.

# పినపాక, భద్రాచలానికీ 'దళితబంధు'

- రైతుబంధు, రైతుబీమా తెచ్చిందీ, ఇస్తున్నదీ తెలంగాణ సర్కారే..
- నాడు మంచం పట్టిన మన్యంలో నేడు మెరుగైన వైద్య సేవలు
- ధరణిని తీసేస్తామంటూ కాంగ్రెస్ వాళ్లు కారుకూతలు కూస్తున్నారు
- భద్రాచలంలో గోదావరి కరకట్టకు రూ.1,000 కోట్లు ఇచ్చాం
- పార్టీల విధానాలను, అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటేయాలి
- పినపాక, భద్రాచలం ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ప్రతి కుటుంబానికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తమ నియోజకవర్గానికి ఈ పథకం కావాలంటూ ప్రభుత్వ విప్, పినపాక అభ్యర్థి అయిన రేగా కాంతారావు కోరారని, ఆయన కోరిన విధంగానే ఈ రెండు నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో ఈ పథకాన్ని అమలు చేస్తామని అన్నారు. ఇదేగాక భద్రాచలానికి వరద ముంపు రాకుండా రూ.1,000 కోట్లతో నిధులతో నిర్మించే కరకట్టకు తానే శంకుస్థాపన చేస్తానని చెప్పారు. ఈ నియోజకవర్గాల్లో రెండు రోజులు ఉండి ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయి కాబట్టి ఆయా పార్టీల విధాలను, వాటి అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటు వేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురంలో సోమవారం నిర్వహించిన సీఎం ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. 2014 ముందు రైతులు కరంటు కష్టాలతో చాలా ఇబ్బందులు పడ్డారని, కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదని అన్నారు. ఆ ఇబ్బందులు పడలేక ఎంతోమంది రైతులు వ్యవసాయాన్ని మానుకున్నారని గుర్తుచేశారు. అలాంటి సమయంలో తెలంగాణ రావడంతో మన రైతులకు నిరంతర విద్యుత్ అందిస్తూ వస్తున్నామని, పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా రైతుబంధును అందిస్తున్నామని గుర్తుచేశారు. రైతుబంధు లాంటి పథకం దేశంలో మరెక్కడా లేదని అన్నారు. ఇప్పుడు రూ.పది వేలు ఇస్తున్న రైతుబంధు సాయాన్ని మళ్లీ గెలిచాక రూ.16 వేలకు పెంచుతామని అన్నారు. పినపాక నియోజకవర్గంలోనే సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ బరాజ్ నిర్మాణాలు జరుగుతున్నాయని, వచ్చే ఏడాది నాటికి ఉమ్మడి జిల్లాకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అన్నారు.

**మంచం పట్టిన మన్యంలో మెరుగైన ఆరోగ్య సేవలు..**

గతంలో ఎప్పుడూ మన్యం మంచం పట్టిందనే వార్తలు చూసేవాళ్లమని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ సిద్ధించాక ఆ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పైగా ఆరోగ్య తెలంగాణ వైపు అడుగులు వేస్తున్నామని అన్నారు. ఇక్కడ నుంచే గోదావరి నీటిని మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి సరఫరా చేస్తున్నామని అన్నారు. భద్రాచలంలో రెండు రాష్ట్రాలకు ఉపయోగపడేలా ఆసుపత్రిని ఏర్పాటు చేశామని, మణుగూరులోనూ పెద్ద ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు.

**పోడు భూములకు పట్టాలిచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌ది..**

పోడుభూములకు పట్టాలిచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని అన్నారు. పినపాక నియోజకవర్గంలో 57 వేల ఎకరాలపై 16 వేల మందికి హక్కులు కల్పించామని, రైతుబంధు అందిస్తున్నామని వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే వారికీ పట్టాలు అందిస్తామని అన్నారు.

**వరద ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళిక..**

గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా భద్రాచలం, పినపాక నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక తప్రణాళిక తయారు చేశామని అన్నారు. వరదల వల్ల ఏ కొంచెమూ నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ ఏడాది వరదల్లో 14 వేల మందికి రూ.పది వేల చొప్పున అందించామని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించే బాధ్యత ఇక్కడి ప్రజలదని అన్నారు. అలాగే రేగా కాంతారావు అడిగిన సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని అన్నారు. రూ.300 కోట్లతో మన్యంలో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించామని అన్నారు.

**కారు గుర్తుకు ఓటేయాలి..**

ఓటు వేసే ముందు ప్రజలు ఆలోచించాలని సీఎం కేసీఆర్ కోరారు. మంచి మనిషిని చూసి ఓటెయ్యాలని సూచించారు. కారుగుర్తుకు ఓటు వేసి ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారు: ప్రభుత్వ విప్ రేగా



బూర్గంపహాడ్/ సారపాక, నవంబర్ 13: పినపాక నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలిచారని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పేర్కొన్నారు. ఆయన సహకారంతోనే రూ.వేల కోట్లను తీసుకొచ్చి నియోజకవర్గన్ని తీర్చిదిద్దామని అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దళితులందరికీ దళితబంధును అందిస్తామన్నందుకు నియోజకవర్గ దళిత సోదరుల తరపున సీఎం కేసీఆర్‌కు తాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. దశాబ్దాల పోడు సమస్యకు సీఎం కేసీఆర్ చరమగీతం పాడారని అన్నారు. తాను కూడా ఇక్కడి పోడు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. పెద్దమనసుతో ఈ సమస్యపై అధ్యయనం చేసి ఈ ప్రాంత పోడురైతులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పోడు రైతులకు పట్టాలిచ్చిన తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ అని కొనియాడారు. పోడు రైతులందరికీ పట్టాలు, రైతుబంధు, రైతుబీమా అందడంతో తన జన్మధన్యమైనట్లయిందని అన్నారు. ఇంకా కొంతమంది రైతులకు పోడు పట్టాలు అందాల్సి ఉందని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే వారికీ అందిస్తామని అన్నారు. అనంతరం నియోజకవర్గంలో పలు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చారు. పినపాక నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్న మణుగూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, మణుగూరులో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ వేతనాలు పెంచేలా జీవోను తీసుకురావాలని, ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని కోరారు. ప్రధానంగా వరదల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనేతరులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని, అశ్వాపురం, బూర్గంపహాడ్ మండలాల్లో 8 వేల ఎకరాల్లో పాత పట్టాలు రైతులకు ధరణి ద్వారా కొత్తగా పట్టాలు మంజూరు చేయాలని కోరారు.